www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 5 డిసెంబర్ 2023



ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతోముందుకు వెళ్లాలని ప్రముఖ న్యాయవ్యాది, నందలూరు కోర్టు బార్ కౌన్సిల్ అసోసియేషన్ కోశాధికారి వంపన వినయ్ కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా సోమవారం ఖాజీపేట మండలంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలు చదువుతున్న భవిత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి సత్యనాగరాజ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వినయ్ కుమార్ హాజరయ్యారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి.సుజాతమ్మ, వి.వినయ్ కుమార్ ,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి , సుజాత,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి బాయి తమ వంతు ఆర్థిక సహాయం అందించారు. .కార్యక్రమం లో భవిత కేంద్రం ఉపాధ్యాయులు అనురాధ, నిర్మల,భవిత కేంద్రం సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నగరంలో నిరసన ర్యాలీ



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - కడప

ఆంధ్ర ప్రదేశ్ భూ హక్కు చట్టం -2022 ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కడప బార్ అసోసియేషన్ (న్యాయ వాదుల సంఘం) అధ్యక్షులు జి.వి. రాఘ వరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు, ప్రజా సం ఘాలు కడప నగరంలో నిరసన ర్యాలీ చేపట్టారు. జిల్లా కోర్టు నుంచి నగరంలోని ప్రముఖ కూడళ్ళు మీదుగా సాగుతూ కలెక్టరేట్ వరకు సాగింది. ఈ సందర్భంగా కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ చట్టం వల్ల ప్రజల స్థిరాస్తి హక్కులకు భంగం వాటిల్లుతుందని అన్నారు. ఈ చట్టం ద్వారా ఆస్తి హక్కును నిర్ణయించే అధికారాన్ని సివిల్ కోర్టు పరిధి నుంచి తీసేసి రెరెన్యూ అధికారులను ట్రిబునల్ చైర్మన్‌గా పెట్టి వారికి అప్పగిస్తారని చెప్పారు. ఈ ట్రిపునల్‌కు సివిల్ ప్రొసీజర్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్, స్పెసిఫిక్ రిలీఫ్ యాక్ట్, లిమిటేషన్ యాక్ట్‌లతో సంబంధం లేకుండా కేవలం సహజ న్యాయ సూత్రాల ఆధారంగా టైటిల్‌ను డిసైడ్ చేస్తారన్నారు. ఈ సహజ న్యాయ సూత్రాలకు సంబంధించి ఇంతవరకు ఎటువంటి చట్టాలు రూపొందించలేదన్నారు. ట్రిబునల్ వ్యవస్థ ద్వారా ప్రజల ఆస్తి హక్కులు పెత్తందారులు, రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీల వారి చేతుల్లోకి వెళ్లే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దీంతో వారి చేతుల్లో ఈ యాక్ట్ పూర్తిగా దుర్వినియోగం అవుతుందని చెప్పారు. తక్షణం ప్రభుత్వం స్పందించి ఈ చట్టంపై పునరాలోచన చేసి రద్దు చేయాలని కోరుతున్నామన్నారు. నిరసన ర్యాలీ కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.ఎస్. బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి వై టీజే కెనడీ, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయ వాదులు, ఐఎల్ కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు సి. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం జిల్లా డిప్యూటీ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. **జమ్మలమడుగు రూరల్ :** ఎపి ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూ హక్కుల చట్టాన్ని 2022 ను వెంటనే రద్దు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నారాయణరెడ్డి, మురళీధర్ రెడ్డి సంయుక్తంగా తెలిపారు. సోమ వారం స్థానిక జూనియర్ సివిల్ కోర్ట్ వద్ద కొత్త చట్టానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు మునిసుబ్బారెడ్డి, సురేంద్ర నాథ్ రెడ్డి, బి.వి.సుబ్బారావు, రామ్మోహన్, నాగార్జున రెడ్డి, జంబాపురం లక్ష్మీ, జ్యోతిరాని, సయ్యద్, కుండా లోకేష్, పాల్గొన్నారు.

ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏకపక్షంగా అమలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ భూమి హక్కు 2022 చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని పిసిసి మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు. సోమ వారం ఆయన కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్ర మంలో న్యాయవా దులు శివ , సుబ్రహ్మణ్యం, కెనడి , శ్రీనివాసులు ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

జిల్లా వాసులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయ్ రామరాజు అన్నారు. సోమవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ నుంచి జెసి జి.గణేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష,డి ఆర్ ఓ గంగాధర్ గౌడ్, హౌసింగ్ పీడీ క్రిష్ణయ్యతో కలిసి 'ఓటర్ల సవరణ జాబిత, జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, ప్రయారిటీ బిల్డింగ్స్, నాడు-నేడు పనుల పురోగతి, విద్యాదీవెన, చేయుత, అమ్మ ఒడి,నేతన్న నేస్తం,కాపు నేస్తం, వాహన మిత్ర' తదితర అంశాలపై సంబం ధిత క్షేత్ర స్థాయి అధికారులతో వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామ రాజు సమీక్షిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తు తం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు, అధి కారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు తుఫాను పరిస్థితులను ఎదు ర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఆయా మండల పరిధిలో ఎవైనా సంఘటనలు చోటు చేసు కొంటే వెంటనే జిల్లా కార్యాలయాని సమాచారం అందించాలన్నారు. ప్రజల కు ప్రాణ హాని, ఆస్తి నష్టాలు సంభవించకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. నదులు, వంక లు పరి వాహక, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్ర మత్తం చేయాలని అన్నారు. పశు సంపద, ధాన్యన్ని కాపా డుకొనేందుకు తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ఎక్కడ ఏమి జరుగకుండా జాగ్రత్త పడాలని అన్నారు.


అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు, జెసి, కమిషనర్

విపత్తును సమర్ధవంతగా ఎదుర్కోవాలి : జెసి

రాష్ట్రంలో పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, తుఫాను నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, ప్రజలు కూడా అప్రమత్తం అవ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్ సూచించారు. సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమావేశానికి స్థానిక బోర్డు మీటింగ్ హాలు నుంచి జెసి, ఎస్పి సిద్ధార్థ కౌశల్, డిఆర్ఒ గంగాధర్‌గౌడ్, ఫైర్ శాఖ, పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు హాజ రయ్యారు. విసి ముగిసిన అనంతరం జెసి మాట్లా డుతూ తుఫాన్ ప్రభావం జిల్లాకు ఉన్న ందున జిల్లా యంత్రాంగం అప్రమత్తం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భారీ వర్షాలు, వరదలను సమర్థవంతంగా ఎదురొ ్కనేందుకు ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. ఎక్కడా కూడా ప్రాణ నష్టం, పశు నష్టం, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం చివరి దశలో ఉన్న ఖరీఫ్ పంటలను కాపాడుకునే చర్యలతో పాటు.. చేతికందిన పంట దాన్యాన్ని గోడౌన్లలో భద్రపరుచుకోవాలన్నారు. పశుసంపదను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. అలాగే... సచివాలయాల వారీగా ఆయా పరిధిలోని నీటి వన రులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్లు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి.. గ్రామాల్లో ప్రజలను ఎప్పటికప్పుడు రెవెన్యూ సిబ్బంది అలర్ట్ చేయాలని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో 24 గంటలూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పా టు చేశామని పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయం, కడప కంట్రోల్ రూమ్ : 08562 - 246344, ఆర్‌డిఒ కార్యాలయాలు కడప : 08562 - 295 990, జమ్మలమడుగు : 95028 36762, బద్వేలు : 76708 82856, పులివెందుల : 62810 04720 లలో సంప్రదించాలని చెప్పారు.


నేడు పాఠశాలలకు సెలవు

మిచౌంగ్ తుఫాన్ ప్రభావం కారణంగా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలలకు మంగళవాకరం సెలవును ప్రకటిసున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి రాఘవ రెడ్డి సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. జిల్లాలో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్నందున ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు వాతావరణ శాఖ సూచనలు, కలెక్టర్ ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించే పాఠశాలలపై చర్యలు తప్పవన్నారు.

ఉపాధి నైపుణ్యాలు.. ఉజ్వల భవిష్యత్తుకు మార్గాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ ఉపాధి నైపుణ్యాలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గాలు అని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వై. పి . వెంకటసుబ్బయ్య అన్నారు. 'కెరీర్ అభివృద్ధి కోసం ఉపాధి నైపుణ్యాలు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ వర్క్ షాప్‌ను ఆయన ప్రిన్సిపల్ ఎస్. రఘునాథరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో ఉద్యోగ నైపుణ్యాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థుల ప్రయోజనం కల్పించాలని జాతీయ విద్యావిధానం -2020ని అమల్లోకి తెచ్చిందన్నారు. డిగ్రీ విద్యార్థులకు 10 నెలల ఇంటర్నెట్ షిప్ అమలు చేస్తూ ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందిస్తోందన్నారు. అకడమిక్ మార్కులు ఇంటర్వ్యూ వరకు తీసుకెళ్తాయని, ఉద్యోగ ఎంపికకు ఎంప్లాయిస్ స్కిల్స్ కీలకమనే విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ అభివృద్ధి ప్రపంచీకరణ ముందు, తర్వాత అని విశ్లేషించవచ్చన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో ఎంప్లాయిబిలిటి స్కిల్స్ కీలకమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రజ్ఞాసూచి (ఐక్యూ) ఉన్నప్పటికి ఉద్యోగ విజేతలు కాలేరని బావోద్వేగ గుణ నైపుణ్యాలు ఉండాలన్నారు. భావవ్యక్తీకరణ, సర్దుబాటు, సృజనాత్మక, సమస్య పరిష్కార నైపుణ్యాలు, నైతిక నియమాలు కలవారు వ్యాపార, ఉద్యోగ జీవితంలో రాణిస్తారన్నారు. అనంతరం ' మిషన్1000' పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ క్రియేటివ్ మైండ్స్ ప్రయివేట్ లిమిటెడ్ సిఇఒ కె సునీల్ రెడ్డి వర్క్ షాప్ నిర్వాహక కార్యదర్శి డాక్టర్ పి.సరిత కార్యాలయ కన్వీనర్ డాక్టర్. కె. లలిత, కో కన్వీనర్ డాక్టర్.వి. లాజర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సరిత డాక్టర్ సునీత, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


వర్క్‌షాపులో మాట్లాడుతున్న వైవీయూ రిజిస్ట్రార్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్


సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మిరాజ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పాలకవర్గాలు, అధికారులు వైఫల్యం చెందడం వల్ల ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులను, ఉపాధ్యాయులను నిర్లక్ష్యంగా ఏకపక్ష ధోరణి సంఘాలతో చర్చించకపోవడం కారణంగా ఎన్నికలలో తగిన మూల్యం చెల్లించుకుందని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితి మన రాష్ట్రంలో వచ్చే ఎన్నికలలో చవిచూడకుండా ఉండాలంటే ముఖ్యమంత్రి వెంటనే ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించడానికి సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వం విద్యారంగా వినాశకర విధానాలు విడనాడాలని ఉపాధ్యాయ సమస్యలు సిపిఎస్‌చ జిపిఎస్ కాకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసి ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. పాథమిక విద్య నిర్వీర్యం కావటానికి అమలులోకి తెచ్చిన జీవో 117ను వెంటనే రద్దు చేయాలని కోరారు. లేని పక్షంలో ఈ ప్రభుత్వం కూడా తగిన మూల్యం చెల్లించుకుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు రమణ ఎజాజ్ అహ్మద్, చంద్రశేఖర్, జావేద్, వెంకటసుబ్బయ్య, ప్రభాకర్, శివశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులను మోసగించడం తగదు

ప్రజాశక్తి - కడప



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హరికృష్ణ

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ విద్యా ర్థులను మోసగిస్తూ ఉండడమే విద్యా సాధి కారతనా అని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు జిలనిబాష ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చలగాటమాడుతూ పేద బడుగు బలహీన వర్గాల పిల్లలు, బ్యాక్వర్డ్ క్లాస్ పిల్లలకు ఉన్నత విద్య అయిన పీజీకి ఫీజు రియంబర్స్‌మెంట్ ఆపి, విదేశీ విద్యకి ఇచ్చే ప్రోత్సాహకాలను నిలుపుదల చేశారని చెప్పారు. జగనన్న విద్యా దీవెన సకాలంలో ఇవ్వకుండా అటు విద్యార్థులను వారి తల్లిదండ్రులను సచివాలయాలు చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. జగనన్న విద్యా దీవెన కింద ప్రతి సంవత్సరమూ నాలుగు కంతులు ఇవ్వాల్సి ఉండగా మూడు కంతులు వేసి నాలుగో కంతు ఇవ్వలేదని చెప్పారు. జగనన్న వసతి దీవెన కింద రూ. 20 వేలకు బదులు రూ. పది వేలు ఇస్తున్నారని వాపోయారు. ఐటిఐ విద్యార్థులకు పదివేలకు బదులు రూ. 7500 ఇస్తూ మోసం చేస్తుందని మీరు కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలకు విద్యార్థులకు నిజాలు చెప్పాలని హితవు పలికారు. సమావేశంలో 22 డివిజన్ ఇన్‌ఛార్జి పుట్టబోయిన శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం : జెసి

కడప : ప్రతి సోమవారమూ 'స్పందన' కార్యక్రమంతో పాటు మండల స్థాయిలో నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జెసి గణేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు.సోమవారం కల క్టరేట్‌లోని స్పందన హాలులో స్పందన కార్యక్రమం జరిగింది. జెసితోపాటు డిఆర్ఒ గంగాధర్‌గౌడ్, ఎస్‌డిసి రామోహ్మన్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిం చారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు శ్రీరాములు

ఎపిలోనూ కాంగ్రెస్‌దే అధికారం : డిసిసి

కడప : 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై ఈనెల 5న కమలాపురంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. కొన్నేళ్లుగా ఆ ప్రాంత వాసులు రైల్వే గేటు సమస్యతో చాలా ఇబ్బంది పడుతున్నారని పేర్కొ న్నారు. కేంద్ర ప్రభుత్వం సేతు బంధన్ పథకం ద్వారా కమలాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం 2023 జూన్‌లో రూ. 23.53 కోట్లు భూసేకరణకు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఇంతవరకు ఎలాంటి పురోగతి లేదని వాపోయారు. ఇలా చాలా సమస్యలు కమలాపురం నియోజకవర్గంలో ఉన్నాయన్నారు. తహశీల్దార్‌కు, రైల్వేస్టేషన్ మేనజర్‌కు వినతి పత్రాలు సమర్పిస్తామని చెప్పారు. ర్యాలీకి జిల్లాలోని అన్ని నియోజ కవర్గల నుంచి సమన్వయ కమిటీ కన్వీనర్లు, సభ్యులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కమలాపురం అసెంబ్లీ నియోజ కవర్గం సమన్వయ కమిటీ కన్వీనర్ వై.విష్ణు ప్రితమ్ రెడ్డి, కమలాపురం అసెం బ్లీ సమన్వయ కమిటీ సభ్యుడు పొట్టి పాటి చంద్రశేఖర్ రెడ్డి, పిసిసి రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, మోపూరి వెంకటరమణారెడ్డి, ఒబిసి జిల్లా అధ్యక్షులు చిన్న కుళ్లాయప్ప, బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొపూరి శ్రీనివాసులు, మామిళ్ళ బాబు, ఆనంద్ కుమార్, నాగరాణి, సురేష్ పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలని మైనారిటీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ .దస్తగిరి కోరారు. సోమవారం స్పందనలో జెసి గణేష్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద ముస్లిం ప్రజల అభివృద్ధికి ఉపయోగించాల్సిన వక్ఫ్ భూములు అన్యాక్రాంతమవుతున్నా వాటిని కాపాడాలని కోరారు. ప్రహరీని నిర్మించాలని పేర్కొన్నారు. నగరంలో పలుచోట్ల కోట్లాది రూపాయల ఆస్తులను భూ కబ్జా దారులు ఆక్రమిస్తున్నారని వాటిని రక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాకీర్ మౌలానా, ఎస్ డిపిఐ జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా, కరిముల్లా, సాబీర్, అబ్దుల్లా, హనీఫ్ పాల్గొన్నారు.

జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్‌రెడ్డి

ఎర్రగుంట్ల : కడప జిల్లా వైసిపి విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పెదనపాడు గ్రామానికి చెందిన బోరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిని నియమించారు. ఆమేరకు సోమవారం నియామక పత్రాన్ని విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు చైతన్య, జిల్లా అధ్యక్షులు సాయి దత్త, ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ షాహిద్ ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి, జిల్లా అధ్యక్షులు సురేష్ బాబుకు, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థుల్లో ప్రభుత్వ పథకాలపై చైతన్యం తెచ్చి పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు.

పవన్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్

సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో పవన్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి తెలిపారు. సోమవారం పోటీలలో సర్టిఫికెట్స్, మెడల్స్ పొందిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 3న కర్నూలులో నిర్వహించిన ఏడు గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్, ఎనిమిది బ్రాంచ్ మెడల్స్ సాధించారని పేర్కొన్నారు. కోచ్ విజయ్‌ని అభినందించారు. సర్టిఫికెట్స్ స్పోర్ట్స్ కోట లభిస్తుందని చెప్పారు. విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించడం సంతోషంగా ఉందని తెలిపారు.


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్


అన్నదానం గొప్పది

ప్రజాశక్తి- కడప

పేదలను అన్నదానం చేయడం గొప్పవిషమని శ్రీ సాయి యువజన సేవా సంఘం చైర్మన్ మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. కార్తీక సోమవారం కడప సబ్ జైల్ సమీపంలోనీ శ్రీ చౌడమ్మ వృద్ధాశ్రమంలో కడప తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపికృష్ణ, సూర్య డెవలపర్స్ అధినేత కంచి చసురేంద్రనాథ్ (సూరి) సహకారంతో పేద వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన వారికి ఈ సందర్భం గా కృతజ్ఞతలు తెలియజేశారు. సాయి యువజన సేవా సంఘం ట్రస్ట్ సభ్యులు శంకరాపురం అశోక్ కుమార్, వల్లి బాష, తొమ్మిదో డివిజన్ మాజీ వార్డ్ సభ్యులు ఎం. భాస్కర్ రెడ్డి, డి.సుబ్బ రాయుడు, మాధవరెడ్డి, వృద్ధాశ్రమం నిర్వాహకులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

అన్నదాతలకు సన్మానం

కలసపాడు : మండలంలోని తెల్లపాడు పంచాయతీలో ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద పేదలకు, ప్రజలకు భోజనాలు ఏర్పాటు చేసిన మాజీ ఎంపిటిసి పాలకొల్లు బాలవెంకటరెడ్డి, సతీమణి లక్ష్మీదేవిని సోమవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనకు అవ కాశం గ్రామ స్తులు కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనం తరం రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీత అయిన భజన పుల్లయ్య, ప్రసాద్ రావు సారథ్యంలో శ్రీ కోదండరామ స్వామి బృందంచే కోలాటం నిర్వహి ంచారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ పెద్దలు బిజీ వేముల రోసిరెడ్డి, మాజీ డీలర్ శ్రీనివాసులు, వెంకటయ్య, తెల్లవాడు, దూలవారిపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.


అన్నదాతలను సన్మానిస్తున్న గ్రామస్తులు

ప్రతి ఒక్కరూ హక్కుల గురించి తెలుసుకోవాలి

ప్రజాశక్తి- కడప

ప్రతి ఒక్కరూ హక్కులను తెలుసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవన్‌లో అరెస్ట్, ప్రీ అరెస్ట్, రిమాండ్ స్టేజ్ అంశాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పోలీసు వారు మిమ్మలను ఏ విషయంలో దర్యాప్తు కోసం పిలిచారో తెలుసుకునే హక్కు మీకు ఉంది అన్నారు. మీరు ఏమి చేశారని పోలీసు వారు భావిస్తున్నారు తెలుసుకునే హక్కు మీకు ఉంది అన్నారు. స్వీయ నేరారోపణను ప్రభావితం చేసే పోలీసు వారి ప్రశ్నలకు సమాధానం చెప్పనవసరం లేని హక్కు మీకు ఉంది అని తెలిపారు. పోలీసు వారు మిమ్మల్ని ప్రశ్నించినప్పుడు వకీలును పెట్టుకునే హక్కు మీకు ఉందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంతా, పి.మనోహర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి. మనోహర్, ప్యానల్ న్యాయవాదులు, పోలీస్, పారా లీగల్ వాలంటరీలు, ప్రజలు పాల్గొన్నారు.

207 పరుగులకు రెస్ట్ ఆఫ్ జోన్ ఆలౌట్

ప్రజాశక్తి - కడప

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో మూడు వికెట్ల నష్టానికి 65 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు ఆట ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు 49.1 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని ఆశిష్ రెడ్డి 40 (నాటౌట్)పరుగులు చేశాడు. సెంట్రల్ జోన్ జట్టులోని రూకేష్ బాబు 4, నవీన్ 4 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన సెంట్రల్ జోన్ జట్టు ఆటో సమయానికి 3.2 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 7 పరుగులు చేసింది.

201 పరుగులకు సౌత్ జోన్ జట్టు..

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న వేరొక మ్యాచ్‌లో ఆర్ వికెట్లను నష్టానికి 171 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు ఆట ప్రారంభించిన సౌత్ జోన్ జట్టు 64.4 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సాకేత్రామ్ 35 పరుగులు చేశాడు. నార్త్ జోన్ జట్టులోని వాసు అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఐదు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన నార్త్ జట్టు ఆట ముగిసిన సమయానికి 15.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 48 పరుగులు చేసింది.

'ఆటా' అంతర్జాతీయ సాహితీ సదస్సుకు ఆహ్వానం

కడప అర్బన్ : అమెరికా తెలుగు సంఘం(ఆటా) ఆధ్వర్యంలో హైదరాబాదులోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఈనెల 17న నిర్వహించే అంతర్జాతీయ సాహితీ సదస్సుకు యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యాపకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డికి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'జానపద దృశ్యకళారూపాలు - ప్రదర్శనా పద్ధతులు' అనే అంశంపై ప్రసంగిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు, కవిపుంగవులు, సినీ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య పి.వెంకటసుబ్బయ్య, విశ్వవిద్యాలయ సిబ్బంది ఆచార్య రామప్రసాదరెడ్డిని అభినందించారు.

జంతు అధ్యయన యాత్రలో వైవీయూ విద్యార్థులు

కడప అర్బన్ : యోగివేమన విద్యాలయం జంతుశాస్త్ర శాఖ విద్యార్థులు 'జంతు అధ్యయన యాత్రలో భాగంగా సోమవారం మైసూర్, బంధిపూంగ్ తదితర ప్రాంతాలు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. పి. వెంకటరమణ ఆధ్వర్యంలో సందర్శించారు. మైసూర్‌లోని చామ రాజేంద్ర జువాలజికల్ గార్డెన్ ను సందర్శించి అక్కడ జంతువుల వివరాలను సేకరించారు. స్టడీ టూర్ ఈనెల 8వరకు కొనసాగుతుందని ఆ శాఖ విభాగపు అధిపతి డాక్టర్ నరాల వెంకటరామిరెడ్డి తెలిపారు. విద్యార్థుల వెంట అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ మరియదాస్ ఉన్నారు.

పనులు వేగవంతం చేయాలి

సింహాద్రిపురం : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వైసిపి మండల కన్వీనర్, మండల ఉపాధ్యక్షులు దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో జరుగుతున్న పార్కు, ఆర్టీసీ బస్టాండ్, సిమెంట్ రోడ్డు, నూతన తహశీల్దార్, ఎంపిఇఒ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల చివరి వారంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి పనులను ప్రారంచించనున్న నేపథ్యంలో సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులు పనులు వేగవంతం చేసి పూర్తిచేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

అభివృద్ధి పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజలకు ఇబ్బంది పడకుండా అభివృద్ధి పనులు చేయాలని తెలుగుదేశం పార్టీ శాసన మండలి సభ్యులు భూమి రెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలో రోడ్ల విస్తరణ చేపట్టిన, పరిహారం మాత్రం ఇష్టం సారంగా రాజకీయ పలుకుబడి ఉన్నవారికి మాత్రమే ఇచ్చి, లేని వారికి ఇంతవరకు పరిహారం అందించ లేదని వాపోయారు. అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆర్టీసీ పాత బస్టాండ్ వద్ద వైఎస్ఆర్ పార్టీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నే నాలుగు సార్లు మార్పించిందని చెప్పారు. దీనికోసం లక్షల రూపాయలు ప్రజల సొమ్ము దుర్వినియోగమైందని చెప్పారు. అంతాయప్ప స్వామి ఊరేగింపు గతంలో మాదిరిగానే నిర్వహించే విధంగా రహదారి ఏర్పాటు చేయాలన్నారు.

'బిసిల బాంధవుడు మన చంద్రన్న' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జిల్లా బిసి సెల్ విభాగం తరపున ప్రచురించిన 'బిసి బాంధవుడు మన చంద్రన్న' అనే పుస్తకాన్ని సోమవారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 74 మంది బిసి నేతలను చంపిన జగన్ సర్కార్, 5 వేల మందిపై దాడులు చేశారని పేర్కొన్నారు. వైసిపి హయాంలో బిసిల జీవితాలను నిర్వీర్యం చేశారని, ఆ వాస్తవాలను తెలియజేసేందుకే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నామని చెప్పారు. ఆదరణ లాంటి 30కి పైగా సంక్షేమ పథకాలు రద్దు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. ఎస్సీలకు బదలీన వర్గాలకు రిజర్వేషన్ కల్పించగా, బాబు 34 శాతానికి పెంచగా, జగన్ 24 శాతానికి పరిమితం చేశారన్నారు. టిడిపి హయాంలో బడ్జెట్ తక్కువ, వైసిపి హయాంలో బడ్జెట్ ఎక్కువ అయినా వారికి న్యాయం జరగలేదని వాపోయారు. బిసిలను అణగదొక్కేందుకే వైసిపి పాలన సాగుతోందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బిసి ఉపాధ్యక్షులు మేకల బాబు, సుబ్బయ్య, సిద్దయ్య పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వృద్ధులను ఆదరించినప్పుడే సమ సమాజం ఆవిష్కృతమవుతుందని సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (సిర్డ్స్) అధ్యక్షులు సుబ్బారెడ్డి అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో కీ.శే. మందారి జకిరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం వారి మనుమడు లోకేష్ రెడ్డి సహకారంతో శివారు ప్రాంతంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు అన్ని రకాల సేవలు అందిస్తున్న ఆశ్రమ నిర్వాహకులను అభినందించారు. వృద్ధులతో ధ్యానం చేయిస్తూ మానసిక ఉల్లాసానికి దోహదపడాలన్నారు. ఆరోగ్యకరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుపాలన్నారు. వృద్ధులు ఈ వయసులో ఇతరత్రా ఆలోచనలు లేకుండా ప్రశాంత జీవనం గడపాలని కోరారు. కార్యక్రమంలో ఒంటెద్దు చెన్నమ్మ లోకేష్ రెడ్డి సొసైటీ సభ్యులు రమణమ్మ గంగావాణి చంద్రబాబు నాయుడు ఆశ్రమ ప్రకాష్ ఆశ్రమ మేనేజర్ రఘునాథ్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వ్యాపారం అభివృద్ధి చెందాలి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్



షాపు ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ

వ్యాపారాన్ని చక్కగా చేసుకుని అభివృద్ధి చెందాలని వైసిపి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం మూడు రోడ్ల కూడలి వద్ద ఏర్పాటు చేసిన 'జెల ఎంటర్ ప్రైజస్ షాప్' ను ఆయన ప్రారంభించారు. పూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత ప్రారం యజర్ కర్ర రామకృష్ణారెడ్డికి కలిసి దుకాణాన్ని ప్రారంభించి అభినందనలు తెలియజేశారు. అనం తరం ప్రొప్రయిటర్ మాట్లాడుతూ తమ వద్ద గృహ అవసరాలకు, రైతులకు సంబంధించిన పివిసి పైపులు, ప్లంబింగ్, ఫిట్టింగులు అందుబాటులో ఉన్నాయన్నారు. సరసమైన ధరలకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, మోరగుడి, జమ్మలమడుగు వాసు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పొన్నపురెడ్డి గిరిధర్ రెడ్డి, శ్రీ షిరిడి సాయి డిగ్రీ కళాశాల యాజమాన్యం కర్ర సంజీవరెడ్డి, ఎన్.ఆర్ రాజు, రామకృష్ణారెడ్డి సమీప బంధువులు స్నేహితులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): విద్యార్థులు డిగ్రీ తరువాత సాఫ్ట్‌వేర్‌తో పాటు అన్ని రంగాల్లో రాణించాలని కరస్పాండెంట్ ఎల్. నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని శ్రీ వాసవి కళ్యాణ మండపంలో శ్రీ వేదవ్యాస కాలేజీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ తర్వాత ఐఏఎస్,ఐపిఎస్, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌నూ ప్రతిభ కనబరచాలన్నారు. ఏ రంగంలోనైనా ప్రముఖ స్థానంలో ఉండాలన్నారు. కళాశాల ప్రెసిడెంట్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. అధ్యాపకులు సుబ్బయ్య మాట్లాడుతూ ఎంతటి ఉన్నత స్థితిలో ఉన్నా తల్లిదండ్రుల బాధ్యత మరువరాదన్నారు. అధ్యాపకులు కోదండపాణి మాట్లాడుతూ డిగ్రీ కాలేజీలో నిర్వహించే క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎంపికయ్యేందుకు బాగా కృషి చేయాలన్నారు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగాలు సాధించి వేదవ్యాస డిగ్రీ కాలేజీకి జిల్లా స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. మాజీ కౌన్సిలర్ తంగాసుబ్బారాయుడు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సాం స్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాగరాజు, యాసిన్, లక్ష్మిరెడ్డి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దె భారమై..సచివాలయం తరలింపు

ప్రజాశక్తి - ముద్దనూరు



మూతపడిన సచివాలయం -2

ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సచివాలయాల వ్యవస్థ ఏర్పా టు చేశారు. జనాభా ప్రాతిపదికన మండలం కేంద్రంలో 1,2 సచివాలయాలు ఏర్పాటు చేశారు. సచివాలయం -1 సంబంధించి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో, సచివాలయం -2 స్టేట్ బ్యాంకు సమీపంలో అద్దె ఇంట్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అద్దె భారం కావడంతో గత శుక్రవారం నుంచి అధికారులు కార్యాలయాన్ని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి తరలించారు. ముందు రోజులు సచివాలయం తెరవకపోవడంతో సచివాలయం తరలించిన విషయం తెలియని ప్రజలు కార్యాలయం వద్దకు వచ్చి వెనుదిరుగుతున్నారు.

త్వరలో కొత్త సచివాలయానికి మార్పుస్తాం : ఇఒపిఆర్‌డి

సచివాలయం -2 కార్యాలయం సంబంధించి అద్దె ఇంట్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని ఇఒపిఆర్‌డి వీరభద్రుడు పేర్కొన్నారు. ఇంటి యజమాని ప్రతి ఏడాది అద్దె పెంచాలనడంతో ప్రస్తుతం సచివాలయం -1కు తరలించామని, త్వరలో కొత్త సచివాలయంలోకి మార్చుస్తామని తెలిపారు.

వరి నూర్పిడి ప్రారంభం

పొలాల్లోనే ధాన్యం అమ్మకాలు



సీతారామాపురం వద్ద ధాన్యాన్ని విక్రయిస్తున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్‌లో సాగైన వరి పంట నూర్పిడి పనులు ప్రారంభమైనా , రైతులు పంట పొలాల్లోనే అమ్మకాలు చేపడుతున్నారు. నూర్పిడి పనులు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనుగోలు చేపట్టలేదు. దీంతో రైతులు పంట పొలాల్లోనే అమ్మకాలు చేపడుతున్నారు. పైగా గతంలో కంటే ఈ సారి ధరలు అధికంగా ఉండడంతో విక్రయిస్తున్నారు. జిల్లాలో కేసి కెనాల్ కింద సాగు పూర్తిగా తగ్గింది. జిల్లాలోనే వరి సాగు చాలా వరకు తగ్గింది. గతంలో కుందు ,పెన్నా నదులు, తెలుగు గంగా, మైలవరం, పైడిపాలెం, చిత్రావతి, గండికోట రిజర్వాయర్ల పరిధిలో 1.10 లక్షల ఎకరాలకు పైగా రైతులు వరి పంటను ఖరీఫ్ సీజన్‌లో సాగు చేపట్టేవారు. ఈ ఏడాది వర్షాలు సాధారణం కంటే తక్కువగా కురవడంతో సాగు గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం పంట నూర్పిడి పనులు గత నెల రెండవ వారం నుంచి ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం తుఫాన్‌కు వరి పంట నూర్పిడి చేస్తున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎకరాకు 24 నుంచి 30 బస్తాల వరకు దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులు వరి ధాన్యాన్ని నిల్వ ఉంచుకునే వసతులు లేకపోవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పంట పొలాలలోనే అమ్మకాలు చేపడుతున్నారు. పుట్టి (600 కేజీలు) జిలకర రకం రూ. 16వేల లోపు పలుకుతోంది. వరి ధాన్యాన్ని ఆరబెట్టి అమ్మకాలు చేపడితే తరుగులు వస్తాయని దీంతో రైతులు కూడా పొలాలలో అమ్మకాలు చేపడుతున్నారు.

రూ.2500 కోట్లతో అభివృద్ధి పనులు ఎక్కడ చేశారు?

- టిడిపి ఇన్‌ఛార్జి జి.వి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)



మీడియాతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

రూ.2500 కోట్లతో ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే ఎన్ని అభివృద్ధి పనులు చేశారో ప్రజలు, విద్యావంతులు, మేధావులు గమనించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ జి.వి. ప్రవీణ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైసిపి అధికారం దక్కించుకొని, రాచమల్లు 2వ సారి ఎమ్మెల్యే అయ్యే సందర్భంలో సంవత్సరానికి రూ.500 కోట్లు నిధులు ఇస్తే చాలని, మంత్రి పదవి వద్దు అని చెప్పారన్నారు. సిఎం సొంత జిల్లా వాసి అయివుండి కూడా గోల్డెన్ ఛాన్స్ ఉండి కూడా ఇక్కడ ఎమ్మెల్యే అభివృద్ధి చేయలేక పోయారన్నారు. ఎమ్మెల్యే ఎక్కడ విఫలం అయ్యారు తనకు తెలియడం లేదన్నారు. గడచిన కాలంలో సంవత్సరానికి 500 కోట్లు తెచ్చారా? అని ప్రశ్నించారు. మెడికల్ కళాశాల తెస్తానన్న ఎమ్మెల్యే ఏమైందని ప్రశ్నించారు. నాడు నేడు పనులతో పాఠశాలలను అభివృద్ధి చేశామని చెబుతున్నారని వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలలు మూతబడ్డాయి ప్రజలకు వివరం చాలన్నారు. అమ్మఒడి ఇద్దరికి లేదా ఇంట్లో ఎంతమంది ఉన్న ఇస్తామని, ఇప్పుడు ఒక్కరికే ఇస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా 350 పడకల ఆసుపత్రిని సందర్శించి, అక్కడ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారి బాధ లను చూడాలన్నారు గైనకాలజిస్ట్ డాక్టర్లు తగిన ంత మంది లేరని, గర్భిణులు కాన్పుల కోసం ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో మౌలిక సదు పాయా లు కరువు అయ్యా యని, రోడ్ల దయ నీయంగా, డ్రెయినేజీలో మురుగు చేరి దోమలకు ఆవా సాలుగా మారాయన్నారు. 2019 ఎన్నికలకు ముందు రెండు సెంట్ల స్థలంలో ఇల్లు కట్టించి తాళాలు ఇస్తా అన్న ఎమ్మెల్యే ఇంతవరకు ఒక్కసారి వాకిలి ఇల్లు నిర్మించలేదని విమర్శించారు. కడప స్టీల్ ప్లాంట్ గురించి ఏనాడు అసెంబ్లీలో రాచమల్లు మాట్లాడలేదన్నారు. రోజా ఆర్‌బండ్ వి గెస్ట్ హౌస్‌లో కూర్చుంటున్న ఎమ్మెల్యేకు ప్రహరీ కనిపించలేదా, అసలు ప్రహరీ గోడ కట్టలేనివాడు ప్రొద్దుటూరులో అభివృద్ధి ఏమి చేస్తాడని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో తనకు అవకాశమిస్తే, తన విజన్‌తో శాంతి ప్రొద్దుటూరు నిర్మించి అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానన్నారు.

కాంగ్రెస్‌కు అరణ్య వాసం పూర్తయింది : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి అరణ్యవాసం ఆయి పోయిందని గత వైభవం పున ప్రారంభమయిందని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నెహ్రూ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి కంచుకోట లాంటిదని చెప్పారు. రాష్ట్ర విభజన కారణంగా 10 సంవత్సరాలు అధికారం కోల్పోయి అరణ్యవాసం చేయాల్సి వచ్చిందని చెప్పారు. తెలంగాణలో 10 సంవత్సరాలు అరణ్య వాసం ముగించుకొని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. ఆదే విధంగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌నూ అధికారంలోకి వస్తుందని తులసిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మొన్న కర్ణాటకలో కాంగ్రెస్, నిన్న తెలంగాణలో కాంగ్రెస్, రేపు ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ అన్న నినాదంతో ముందుకు వెళ్తుతుందని చెప్పారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి వస్తే 6 సూత్రాలు అమలు చేస్తామన్నారు. **రోశయ్య రాజకీయ భీష్మాచారుడు**..ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య ద్వితీయ వర్ధంతిని వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కీ.శే. రోశయ్య గొప్ప ఆర్థిక వేత్త అన్నారు. 15 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టి దేశంలోనే రికార్డు నెలకొల్పారని చెప్పారు. పదవులకే రోశయ్య వన్నె తెచ్చినట్లు చెప్పారు. రాజకీయ భీష్మాచారుడని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, రామకృష్ణ, నరసింహారెడ్డి, బద్రి, వినోద్, బాలు సుబ్బరాయుడు, వేమయ్య పాల్గొన్నారు. **తులసిరెడ్డికి సన్మానం**..పులివెందుల, సింహాద్రిపురం మండలాల కాంగ్రెస్ నాయకులు పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డిని ఘనంగా సన్మానించారు. పులివెందుల మండల కన్వీనర్ రియాజ్ రెడ్డి, సింహాద్రిపురం మండల కన్వీనర్ శివలు కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. ఈ నేపథ్యంలో సోమవారం వేంపల్లెలో ఉన్న పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డిని పులివెందుల, సింహాద్రిపురం మండలాల కన్వీనర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. పదవులు పొందినందుకు తులసిరెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.

అల్లాడుపల్లెలో అన్నదానం

ప్రజాశక్తి-చాపాడు



అన్నదానం చేస్తున్న దాతలు

మండల పరిధిలోని అల్లా డుపల్లె వీరభద్ర స్వామి ఆలయ ఆవర ణంలో కార్తీక మాసం సోమవారం సంద ర్భంగా సర్పంచ్ జి.సి కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కోలాటం భక్తులను అలరించింది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మహిళా కళాకారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో అల్లాడుపల్లెకు చేరుకున్నారు. గ్రామ సమీపంలోని కుందూ నదిలో కార్తీక స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఇఒ శ్రీనివాసులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. ఆర్య వైశ్య సర్వజన కళ్యాణ మండపంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వైసిపి నాయకుడిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని సచివాలయంలో పనిచేస్తున్న సెక్రటరీని లైంగిక దాడికి పాల్పడిన వైసిపి నాయకుడిని కఠినంగా శిక్షించాలని బాధితురాలి తల్లి అధికారులను వేడుకున్నారు. సోమవారం కమిషనర్‌కు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. ఈ సందర్భంగా ఆమె తల్లి విలేకర్లతో మాట్లాడుతూ చాలా రోజులు నుంచి తమ అమ్మాయిని వేధిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ విషయం ఆతని ఇంట్లో చెప్పినా పట్టించుకోవడం లేదని తెలిపారు. వైసిపి నాయకుడి నుంచి తమ అమ్మాయికి ప్రాణహాని ఉందని వాపోయారు. తప్పు చేసినా పశ్చాత్తాపం లేకుండా 'మాబావ ఎమ్మెల్యే ఆయనే చూసుకుంటాడు' అని చెప్పి వెళ్లిపోవడం దారుణమని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ అమ్మాయిని వేధిస్తున్న వైసిపి నాయకుడిపై చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని ఆమె కోరారు.

ఘనంగా వై.ఎస్.మధు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గం తొండూరు మండలం వైసిపి ఇన్‌ఛార్జ్ వై.ఎస్ మదనమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ మధు నివాసానికి వెళ్లి పూల బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు వైసిపి నాయకులు స్వచ్ఛంద సంస్థలలో బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేసి వారికి తినిపించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని రౌడీషీటర్లకు సోమవారం ఎస్ఐ హుసేన్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే 'రిని' చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు ఎప్పుడూ నిఘా ఉంటుందని, 15 రోజులకు ఒకసారి స్టేషన్‌కు వచ్చి కనిపించాలని సూచించారు. ఊరు నుండి బయటకు వెళ్లే ముందు పోలీసులకు సమా చారం ఇవ్వాలన్నారు.

ప్రహరీని నిర్మించాలి : ఎస్ఎఫ్ఐ



ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి- జమ్మలమడుగు

వందేళ్ల చరిత్ర కలిగినటువంటి పిఆర్ ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానం కాంపౌండ్ గోడను నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎ. వినయ్‌కుమార్ కోరారు. సోమవారం ఆర్‌డిఒ. శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ పట్టణంలో ఏ పోటీలైనా ఇదే మైదానంలో నిర్వహిస్తారని తెలిపారు. పైగా పట్టణ వాసులకు వాకింగ్, స్పోర్ట్స్ ఆడేందుకు క్రీడా మైదానం ఉపయోగపడుతోందని చెప్పారు. అలాంటి మైదానానికి ప్రహరీ లేనందున మురుగునీరంతా వచ్చి చేసి అధ్వానంగా మారుతోందని వాపోయారు. చుట్టుపక్కల ఉన్న వారు వదులుతున్న వ్యర్థాలతో మైదానంతా అపరిశుభ్రంగా తయారైందని పేర్కొన్నారు. రాత్రి సమయంలో కొంత మంది మందుబాబులు మద్యం సేవించి మైదానంలోనే సీసాలను పగలగొడుతున్నారని, కొన్ని అసాంఘిక కార్యక్రమాలకు ఈ క్రీడా మైదానం అడ్డాగా మారిపోయిందన్నారు. దీని వల్ల విద్యార్థులకు క్రీడలు ఆడుకోవడానికి, వ్యాయామం చేసే వారందరికీ ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. వెంటనే మైదానానికి ప్రహరీని నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, రాజేష్ , హర్షవర్ధన్ , సంతోష్ చరణ్ తేజ, ధరణి, మహేష్ , నాగేంద్ర విష్ణు నాగ సంతోష్, పవన్ విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి

ప్రజాశక్తి - కొండాపురం

రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ఎంతో అవసరమని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కొండాపురం మండలం కేంద్రంలో తొలుతగా వైసిపి జెండా ఎగర వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం విడిపోయిన తర్వాత వచ్చిన ఆనాటి పాలకులు రాష్ట్ర సంక్షేమం- అభివృద్ధి గురించి ఆలోచన చేయకుండా తప్పుడు విధానాలను అనుసరించి ప్రజల నుంచి వచ్చిన రూపంలో వసూలు చేసిన సొమ్మును దోచుకుని పంచుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల బాగోగులు చూడలేదని, సంక్షేమాన్ని గాలికి వదిలేశారని చెప్పారు. జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన నవరత్నాలను అమలు పరచారని, కరోనా కష్టకాలంలో ప్రజలను ఆదుకున్నారని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి నాలుగున్నర సంవత్సరాల పరిపాలనా కాలంలో కొండాపురం పట్టణానికి ప్రత్యక్ష నగదు బదిలీ కింద రూ. 20,63,18,048 కోట్లు , పరోక్ష ప్రయోజనాలు ఇంటి స్థలాలు, విద్యాకానుక, బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లు జగనన్నతోడు ,గోరుముద్ద, సంపూర్ణ పోషణ, కంటివెలుగు, రేషన్, పింఛన్లు వంటి అభివృద్ధి పనులు చేశారని చెప్పారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి నాగ ప్రసాద్, తహశీల్దార్, శోభన్ బాబు, ఎస్ఐ యోగేంద్ర, ఇతర అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువతకు సోమవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో 'సమాజసేవ' అనే అంశంపై ప్రిన్సిపల్ రామిరెడ్డి వ్యవస్థాపకుల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పాపిశెట్టి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పోటీల వల్ల విద్యార్థులకు సమాజసేవ పట్ల ఆసక్తి కలిగి భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా తయారవుతారని అన్నారు. విజేతలకు మంగళవారం అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం సందర్భంగా సర్టిఫికెట్లు, బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. నిస్వార్థంగా సేవలు అందించిన 25 మంది స్వచ్ఛంద సేవకులకు స్ఫూర్తి పురస్కారంతో ఘనంగా సన్మానం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.